ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.2
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 18 ఆగస్టు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	1,45,076	2,11,868
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.70 (3.86)	2937.90	5248.56
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.011 (38.3600)	2,08,530	2,04,130

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

చల్లంగా చూడమ్మ

చల్లంగా చూడమ్మ ఎల్లమ్మ, మా ఇంటిల్లిపాదిపై నీ కరుణా కటాక్షలు ఉండాలమ్మా ముత్యాలమ్మ, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలమ్మా మైసమ్మ. అంటూ జిల్లావ్యాప్తంగా గ్రామదేవతలకు మొక్కుకున్నారు. బోనాల వేడుకల్లో భాగంగా అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించారు.

● వివరాలు 6,8లో..


చిట్యాల మండలం నేరడలో బోనాలు తీస్తున్న గ్రామస్థులు


కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

రయ్.. రయ్‌మంటూ

రయ్.. రయ్‌మంటూ జాతీయ రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు ముగియడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు మహానగరానికి బయలుదేరారు. దీంతో జిల్లాలోని 65వ నెంబర్ జాతీయ రహదారి సందడిగా మారాయి.

● వివరాలు 7లో..

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కేంద్రంగా రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. తరచూ ఆయన ప్రభుత్వంపైన, కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎంరేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేస్తుండడంతో పీసీసీ రంగంలోకి దిగాల్సిన అనివార్యస్థితి ఏర్పడింది.రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను పరిశీలించాల్సిందిగా పీసీసీ క్రమశిక్షణా సంఘాన్ని ఆదేశించినట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌రెడ్డి తెలపగా, రాజగోపాల్‌రెడ్డికి, కాంగ్రెస్‌నేతలకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న విబేధాలు తొలగించేందుకు పీసీసీ క్రమశిక్షణాసంఘం చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి రంగంలోకి దిగారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



రాజగోపాల్‌ను చల్లబరుస్తారట!

» వివాదం సద్దుమణిచే యోచనలో అధిష్ఠానం
» రంగంలోకి క్రమశిక్షణా కమిటీ

హైదరాబాద్‌లో ఆదివారం సమావేశమైన క్రమశిక్షణాసంఘం రాజగోపాల్‌రెడ్డి ఏ సందర్భంలో వ్యాఖ్యలు చేశారనే అంశాలను పరిశీలించినట్లు సమాచారం. సమావేశం అనంతరం మల్లు రవి మాట్లాడుతూ తాను ఫైరింజన్ లాంటివాడినని, మంటలు ఆర్పడమే తన పని అని పేర్కొనడం ద్వారా రాజగోపాల్‌రెడ్డి అంశాన్ని సద్దుమణిగించేందుకు చర్యలు ప్రారంభించినట్లు స్పష్టమవుతోంది. మరోవైపు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సైతం ఏపీలోని విశాఖపట్నంలో మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి అసమ్మతి లేదని, ఎవరి మధ్య విభేదాల్లేవని పేర్కొన్నారు. రాజగోపాల్‌రెడ్డి సైతం పార్టీ ఉన్నతి కోసమే మాట్లాడుతున్నారని భట్టి వ్యాఖ్యానించడం ద్వారా రాజగోపాల్‌రెడ్డి అంశాన్ని అధిష్ఠానం మధ్యేమార్గంగా పరిష్కరించే యోచనలో ఉన్నట్లు సంకేతాలిచ్చినట్లేనని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

తీవ్రత పెంచుతూ వచ్చిన రాజగోపాల్‌రెడ్డి

బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సమయం లో,తిరిగి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రెండుసార్లు తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ మంత్రి పదవి ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది.తనకు పదవి రాకపోవడానికి గల కా రణాలుగా పేర్కొంటూ ఒక్కోసందర్భంలో ఒక్కొక్కటిగా బహిరంగపరుస్తుండడంతో కలవరం రేగుతోంది. మంత్రి వర్గవిస్తరణకు ముందే ఏప్రిల్‌లో చౌటుప్పల్‌లో జరిగిన మార్కెట్ కమిటీ పా లకవర్గ ప్రమాణస్వీకార సందర్భంలో మొదటిసారి రాజగోపాల్‌రెడ్డి తన అసంతృప్తగళాన్ని వి ప్పారు. తనకు మంత్రిపదవి ఇవ్వడానికి అధిష్ఠానవర్గం దాదాపు సిద్ధమైన తరుణంలో మా జీమంత్రి జానారెడ్డి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని లేఖరాయడం ద్వారా తన అవకాశాలకు గండిపడిందని భావించిన రాజగోపాల్‌రెడ్డి చౌటుప్పల్ సభలో జానారెడ్డిని ధృతరాష్ట్రుడితో పోల్చుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్నప్పటికీ ఇటీవల మళ్లీ ఎక్స్‌లో ట్వీట్లతో, నియోజకవర్గంలో కార్యక్రమాల్లో తీవ్ర వ్యాఖ్యలతో సంచలనం సృష్టిస్తున్నారు. సోషల్ మీడియాపై సీఎం వ్యాఖ్యలను ఖండించారు. తనకంటే జూనియర్లకు పదవులిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎల్‌బీనగర్‌లో పోటీచేస్తే మంత్రిపదవి ఇచ్చేవారని, కానీ తానే మునుగోడు అభివృద్ధి కోసం ఇక్కడ పోటీచేశానని చెప్పారు. మహబూబ్‌నగర్‌కు సీఎం పదవి, ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు ఇవ్వగా లేనిది నల్లగొండ జిల్లాకు మూడు పదవులిస్తే తప్పేంటని ప్రశ్నించడం ద్వారా నిత్యం రాజకీయవర్గాల్లో చర్చను రేకెత్తించారు.

సమీకరణలు కుదరక..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఒక మీడియా ప్రకటనలో మంత్రి పదవి విషయంలో రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మాట ఇచ్చింది వాస్తవమేనన్నారు. సమీకరణలు కుదరక ఇవ్వలేకపోయారని పేర్కొనడంతో రాజగోపాల్ వాదనకి బలం చేకూరింది. అనంతరం ఏ సమీకరణలు కుదరడం లేదని, తామిద్దరం అన్నదమ్ములమన్న విషయం మాట ఇచ్చినప్పు డు తెలియదా? అని రాజగోపాల్‌రెడ్డి అధిష్ఠానాన్ని నిలదీశారు. తాజాగా శనివారం మరోసారి రాజగోపాల్‌రెడ్డి సంస్థాన్‌నారాయణపురం మండలంలో జరిగిన కార్యక్రమంలో పదవులే కాదు.. పైసలు కూడా ఇవ్వ డం లేదని వాపోయారు. తమ నియోజకవర్గంలో...

- మిగతా 6వ పేజీలో...

బీసీలను మోసం చేస్తున్న పార్టీలు

బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న పాలూరి రామకృష్ణయ్య

నల్లగొండటౌన్ ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బీసీలను పాలక పార్టీలు మోసం చేస్తున్నాయని బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సమాజంపై పాలకపార్టీలు అవలంబిస్తున్న మోసపూరిత విధానాలను ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు రిజర్వేషన్లు అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తోందని దుయ్యపట్టారు. 42శాతం రిజర్వేషన్ అమలు శాసనసభ పరిధిలోనిదేనని ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్‌తో ఆమోదింపజేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. చట్టసభలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయవచ్చని దానిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని కప్పి పెడుతూ కేంద్రం ఒప్పుకోవడం లేదని ఆరోపిస్తూ రిజర్వేషన్ ఇవ్వకుండా తప్పించుకుంటుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ బీసీలపై చిన్నచూపు చూస్తోందని, రిజర్వేషన్లకు సహకరించకుండా కుల గణన చేయకుండా బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. రెండు పార్టీల విధానాలను ఎండగడుతూ బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి రూపకల్పన చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఐతగోని రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శి వాసు కె. యాదవ్, అధికార ప్రతినిధి చీమల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సిల్వేరు గాలయ్య, డాక్టర్ విద్యారాణి చారి, నాయకులు యాదన్న, మధుమూర్తి గౌడ్, లక్ష్మి, సంహిత, చెరుకు లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరుతరాల ఆత్మీయ సమ్మేళనం

ఆహ్లాదం గడిపిన కుటుంబ సభ్యులు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉప్పుల వంశీయులు

నిడమనూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి చిన్న పిల్లల వరకు ఆరు తరాలకు చెందిన వారు ఒకేచోట కలుసుకున్నారు. ఒకరికొకరు పరిచయం చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనందంగా గడిపారు. పెద్దలను గౌరవించి ఘనంగా సన్మానించారు. ఈ ఆత్మీయ కలయిక నిడమనూరు మండలం గుంటిపల్లికి చెందిన ఉప్పుల వంశీయులు ఆదివారం మండలంలోని కోట మైసమ్మ ఆలయం వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సమ్మేళనంలో 100 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సమ్మేళనం పండుగ వాతావరణంలో జరిగింది. 4వ తరానికి చెందిన ఉప్పుల గోపయ్య దంపతులను 6వ తరానికి చెందిన వారు సత్కరించారు. కుటుంబ విలువలు పడిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి సమ్మేళనాలు బంధుత్వాలు పెంపొందించేందుకు దోహదం చేస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పుల రాధాకిషన్, కేశవులు, శ్రీనివాస్, సత్యనారాయణ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి


సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గట్టుప్పల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మతోన్మాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు కార్యకర్తలు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ మనువాదాన్ని తీసుకురావాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. భారతదేశ ప్రజలు భిన్నత్వంలో ఏకత్వాన్ని కోరుకుంటారని, లౌకికవాదానికి కేంద్రంగా ఇండియా ఉందని, బీజేపీ మతోన్మాద చర్యలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేకమంది సీపీఎం కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని సమ సమాజ స్థాపన కోసం పార్టీ పనిచేస్తుందని అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అంతంపేట, నామాపురం, శివన్నగూడెం రోడ్లు అధ్వానంగా తయారయ్యాయన్నారు. గత ఎన్నికల ముందు లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకుడు చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చాపల మారయ్య, మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, నాయకులు కర్నాటి సుధాకర్, అచ్చిన శ్రీనివాస్, కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ,రాములమ్మ, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఖుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, నాయకులు తూం బుచ్చిరెడ్డి, దేప సుదర్శన్‌రెడ్డి,కోరే యాదయ్య, వలమాల ఆంజనేయులు, ఎండీ. షైనుద్దీన్, వెంకటేశ్వర్లు, జూలూరి వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచే వరకూ పోరాటం


దేవరకొండలో సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

దేవరకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులు, వృద్ధుల పింఛన్లు పెంచేంత వరకు ఎమార్పీఎస్ పోరాడుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదివారం జరిగిన నియోజకవర్గ దివ్యాంగులు, వృద్ధుల సన్నాహాక సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ 18 సంవత్సరాలుగా ప్రభుత్వాలపై పోరాటం చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పింఛన్ల పెంపుపై మాట్లాడటం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ పింఛన్ల పెంపు విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచి ఆయన వారి హృదయాల్లో నిలిచిపోయాడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఎన్నికల హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేల చొప్పున పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సెప్టెంబరు 9వ తేదీన జరగనున్న దివ్యాంగుల చేయూత పింఛన్‌దారుల మహాగర్జన సభకు లక్షలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి గడ్డం కాశీం, సభ అధ్యక్షుడు గుద్దేటి సైదులు మాట్లాడుతూ కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కూడా పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారుల సంఘం నాయకులు శ్రీరామదాసు వెంకటచారి, వెంకన్న యాదవ్, చైతన్యరెడ్డి, ఎరుకల రామేశ్వరి, అందుగుల శ్రీను, ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కంబాలపల్లి వెంకటయ్య, జల్లా నర్సింహ, దీప్లా, కృష్ణ, భాగ్యమ్మ, సుజాత, అలివేలు, నర్సింహ, పార్వతి

పల్లెల్లో బోనాల సంబురం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బోనాల పండుగను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు బోనాలు ఎత్తుకుని గ్రామంలో ప్రదర్శనగా వెళ్లి దేవతామూర్తులకు బోనాలను నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి బోనాల ఉత్సవాలు నిర్వహించి మేళతాళాలతో నృత్యాలు చేశారు. యువకులు కేరింతలు కొడుతూ బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు.


సూర్యాపేటలో బోనాలతో నృత్యాలు చేస్తున్న మహిళలు


తుర్కపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు


నేరేడుచర్లలో బోనాలు ఎత్తుకున్న మహిళలు




రాజాపేటలో బోనాలతో వెళ్తున్న మహిళలు


హుజూర్ నగర్‌లో..


మోటా కొండూరులో..


చౌటుప్పల్‌లో


సూర్యాపేటలోని ఇంద్రవెల్లి ముత్యాలమ్మ వద్ద శివసత్తుల నృత్యాలు


చౌటుప్పల్‌లో..


మునుగోడు మండలం కుదాభక్షపల్లిలో కాటమయ్య బోనాలు

విగ్రహాల వెండి కన్నులు చోరీ

మోత్కూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో చెరువుకట్టకు ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో మూడు గ్రామ దేవతల విగ్రహాలు ఉండగా రెండు విగ్రహాల కుడి వెండి కన్నులు మాయమ య్యాయి. ఆదివారం బోనాల పండుగ కావడంతో కొందరు ఉదయం నుంచే ఆలయా నికి వెళ్లి టెంకాయలు కొట్టారు. మరి కొందరు మహిళలు బోనం తీసుకెళ్లి నేవేద్యం సమర్పించారు. రెండు దేవతా విగ్రహాలకు ఎడమ వెండి కన్ను ఉండటం, కుడి వెండి కన్ను లేకపోవడం గమనించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మోత్కూరు సిద్ధి వినాయక జ్యూవెల్లర్స్ యజమాని ఎ. వెంకటాచారి మొక్కు తీర్చు కోవడానికి ఆలయానికి వెళ్లగా అమ్మవారి విగ్రహాలకు ఒక్కో కన్ను ఉండడాన్ని గమనించారు. దేవతల విగ్రహాలకు కన్నులు లేకపోవడం బాగులేదని భావించి వెంటనే రెండు జతల వెండి కన్నులు చేయించి అమ్మవార్లకు అమర్చారు. రెండు విగ్రహాల నుంచి కుడి కన్నులు మాత్రమే మాయమవడం చర్చనీయాంశమైంది. దొంగ ఎత్తుకెళ్లితే రెండు కన్నులు ఎత్తుకెళ్లాలికాని ఒక్కో కన్ను ఎత్తుకెళ్లడమేమిటని తర్కించుకుంటున్నారు.


వెండి కుడి కన్నులు లేని గ్రామదేవతల విగ్రహాలు

హోటల్‌పై దాడి ఘటనలో కేసు నమోదు

నార్కట్‌పల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఓ హోటల్‌పై యువకులు దాడిచేసిన ఘటనపై కేసు నమోదైంది. ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని దేవీప్రసాద్ హోటల్‌కు శనివారం రాత్రి అల్పాహారం చేసేందుకు బోడ నవీన్, మేడి స్వామిలతో పాటు వచ్చిన మరో ముగ్గురు స్నేహితులు హోటల్ యజమానితో గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా హోటల్‌లోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. బాధితుడు శెట్టి ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నల్లగొండలో కుక్కల స్వైరవిహారం

● మహిళపై దాడి.. తీవ్రగాయాలు ● హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలింపు

నల్లగొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలో కుక్కలు ఆదివారం స్వైరవిహారం చేశాయి. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన పందుల శ్రీదేవి ఇంటి ముందు ఉండగా కుక్కలు వచ్చి దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ దాడిలో ఆమె పొట్టలోని పేగులు బయటికి వచ్చాయి. కుటుంబ సభ్యులు వెంటనే తొలుత జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు ఆపరేషన్ చేయగా ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతోంది. అదేవిధంగా ఇదే వార్డులో వీహాన్(2), వీరేశం(20) ఇంటి ముందు ఆడుకుంటుండగా వారిని కుక్కలు కరవడంతో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి వెళ్లి మహిళను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. వీధి కుక్కల వల్ల వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని మునిసిపాలిటీ అధికారులు స్పందించి వీధి కుక్కలు తరలించాలని కోరారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

చికిత్సపొందుతూ యువకుడు మృతి

మోటకొండూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం తేర్యాల గ్రామానికి చెందిన కనుకునూరి పవన్‌కుమార్(22) హైదరాబాద్‌లోని ఓ మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలు దేరాడు. మండలంలోని ఆరెగూడెం గ్రామా శివారు లోని ఓ వెంచర్‌లో తన వెంట తెచ్చుకున్న గడ్డిమందు తాగాడు. వెంటనే తన బావ చింతల సునీల్‌కు ఫోన్ చేసి తాను గడ్డిమందు తాగి చనిపోతున్నానని చెప్పాడు. సునీల్ పవన్‌కుమార్ తండ్రి రమేష్‌కు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే గడ్డిమందు తాగాడని గమనించి భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సుచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. తన సోదరుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని పవన్‌కుమార్ తమ్ముడు సాయిచరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. అశోక్ తెలిపారు.


పవన్‌కుమార్(ఫైల్)

పాఠశాలలో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

భువనగిరి రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల జడ్పీ హైస్కూల్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల గదుల తలుపులను ధ్వంసం చేసి బీరువాలను తెరిచి చిందరవందర చేశారు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు భువనగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఈశ్వర్‌ది హత్యా.. ప్రమాదమా..?

● మిస్టరీగా మారిన విద్యార్థి మృతి ● న్యాయం చేయాలని బంధువుల ఆందోళన ● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఇందిరమ్మకాలనీకి డిగ్రీ విద్యార్థి మృతి మిస్టరీగా మారింది. శనివారం రాత్రి కాలనీ శివారులో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. యువకుడి అనుమానాస్పద మృతిపై బంధువులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రేమ వ్యవహారాన్ని జీర్ణించుకోలేక హతమార్చారా..? గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో మృతిచెందాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మాదగోని సత్యనారాయణ, నాగమణి దంపతుల కుమారుడు ఈశ్వర్(19) కొంత కాలంగా పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నట్లు స్థానికులు, స్నేహితులు చెబుతున్నారు. సంఘటన జరిగిన ప్రదేశంలో ఈశ్వర్ నడుపుతున్న బైక్ మృతదేహానికి 50 అడుగుల దూరంలోని పొలాల్లో పడిఉండడం, గొంతుపై పదునైన కత్తితో గొంతు కోసిన గాయం ఉండంతో హత్యగా స్థానికులు భావిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెంది ఉంటే తల, శరీరంపై గాయాలు ఉండాలి కానీ అలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈశ్వర్ మృతిచెందిన విషయం ఓ యువతికి తెలియడంతోపాటు మృతదేహం ఫొటోలు సైతం ఆమెకు సోషల్‌మీడియాలో పంపడం వెనుక హత్య కుట్ర దాగి ఉందని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కులాంతర ప్రేమను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రపన్ని పథకం ప్రకారం కిరాయి దుండగులతో హతమార్చి ఉంటారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్న కాలనీవాసులు, బంధువులు న్యాయం చేయాలని కోదాడ- జడ్చర్ల రహదారిపై ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని, త్వరలోనే మిస్టరీని చేదించి మృతిగల కారణాలు వెల్లడిస్తామని సీఐ మోతీరామ్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు నిరసన విరమించుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఈశ్వర్ అనుమానాస్పద మృతిపై ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు కేసువిచారణ ముమ్మరం చేశామని, మృతికి గల కారణాలను త్వరలోనే చేదించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని కుటుంబసభ్యులు, బంధువులకు నచ్చజెప్పి కేసు విచారణకు అన్నివిధాలుగా తమకు సహకరిచాలని పోలీసులు కోరారు. అనంతరం సీఐ మాట్లాడుతూ శనివారం రాత్రి వరకు ఈశ్వర్ కదిలికను గుర్తించేందుకు హనుమాన్‌పేట, ఇందిరమ్మకాలనీ వరకు ప్రధానరహదారులపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈశ్వర్ సెల్‌ఫోన్ స్వాధీనపర్చుకొని కాల్‌డాటాను పరిశీలిస్తున్నామన్నారు. ఈశ్వర్ మృతివెనుక దాగిన మిస్టరీని త్వరలోనే ఛేదిస్తామని సీఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం ఈశ్వర్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈశ్వర్ తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకున్న బంధువులు, ఈశ్వర్(ఫైల్)

కేసుల ఛేదనలో జాగిలం పింకీ కీలక పాత్ర

● నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నేరాలను ఛేదించడంలో జాగిలం పింకీ కీలక పాత్ర వహించిందని, పింకీ మృతి బాధాకరమని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో డాగ్ స్క్వాడ్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ జాగిలం పింకీ అనారోగ్యంతో ఆదివారం తుదిశ్వాస విడిచింది. 2014 సంవత్సరంలో ఐబీటీ మొయినాబాద్‌లో తొమ్మిది నెలల పాటు డాగ్ హ్యాండ్లర్ నాగరాజుతో పాటు శిక్షణ పొంది శిక్షణా కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి బొట్టుగూడలో వ్యక్తిని ముక్కలుగా చేసి తల, మొండెం వేరు చేసి పలు చౌరస్తాల్లో వేసిన సంచలన హత్య కేసు ఛేదనలో కీలకమైన పాత్ర పోషించింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్ వద్ద జరిగిన రూ.1.40 కోట్ల చోరీ కేసులో గంటల వ్యవధిలో నిందితుల జాడ తెలిపింది. యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని వంగాల గ్రామంలో వ్యక్తిని చంపి బావిలో పడవేసిన వారం రోజుల తర్వాత అన్వేషణ చేస్తే నిందితుల ఇళ్లలోకి వెళ్లి పసిగట్టింది. విధి నిర్వహణలో అనేక సేవలు అందించిన పింకీ జాగిలం కళేబరానికి అదనపు ఎస్పీ రమేష్ పూలమాల వేసి నివాళులర్పించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ సంతోష్, ఆర్.యస్.ఐ రాజీవ్, డాగ్ హ్యాండ్లర్ నాగరాజు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది కరుణాకర్, సంపత్, సతీష్, గోపాల్, మహేంద్ర, నరేష్ పాల్గొన్నారు.


పింకీ కళేబరానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ రమేష్

మహిళ మృతిపై సుమోటోగా కేసు నమోదు

తుంగతుర్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ చికిత్స వికటించి మహిళ మృతి చెందడంతో స్పందించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం ఆర్ఎంపీపై సుమోటోగా కేసు నమోదు చేసిందని తెలంగాణ మెడికల్ వైద్య మండలి వైస్ చైర్మన్ డాక్టర్ గుండగాని శ్రీనివాస్ తెలిపారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కౌన్సిల్ సభ్యులు ఆదివారం విచారణ చేసి మాట్లాడారు. తుంగతుర్తిలో ఆర్ఎంపీ శ్రీనివాస్ కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ అనుమతులు లేకుండా సాయిబాలాజీ ఆస్పత్రి నిర్వహిస్తున్నాడని తెలిపారు. గర్భిణులకు తోటి ఆర్ఎంపీలతో కలిసి లింగనిర్ధారణ పరీక్షలతో పాటు గర్భవిచ్ఛితిని ప్రోత్సహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ విష్ణు ఉన్నారు.

రాజగోపాల్‌ని చల్లబరుస్తారట!

(5వ పేజీ తరువాయి)

రోడ్ల నిర్మాణాలకు నిధులివ్వడం లేదని చౌటుప్పల్-వలిగొండ రోడ్డు వేయమంటే కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదంటున్నారని, గ్రామాల్లో సీసీరోడ్లకూ బిల్లులివ్వడం లేదని, గ్రామాల్లోకి వెళితే జనాలు రోడ్లు వేయాలంటున్నారని, మంత్రిని సైతం కలిసి రోడ్లకు నిధులివ్వాలని కోరినా ఇవ్వకపోవడమేంటని బహిరంగంగా నిలదీశారు. పదవులు ఇవ్వకపోయినా ఓర్చుకుంటాను కానీ, నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకునేలా నిధులివ్వకుండా ఉంటే ఎలా ఊరుకుంటామని ప్రశ్నించారు. ఇందులో తన స్వార్థమేమీలేదని, నియోజకవర్గంలో ప్రజలు అడుగుతున్నదే తాను అడుగుతున్నానని పేర్కొన్నారు.

విమర్శలతో కవ్విస్తోన్న నియోజకవర్గ ప్రత్యర్థులు

రాజగోపాల్‌రెడ్డిలో నెలకొన్న అసంతృప్తిని సద్దుమణిచేందుకు ఓ వైపు అధిష్ఠానం క్రమశిక్షణాసంఘం చైర్మన్‌ని రంగంలోకి దింపితే, మరోవైపు రాజగోపాల్‌రెడ్డిని నియోజకవర్గంలోని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలతో కవ్విస్తున్నారు. ఈ నెల 16న నియోజకవర్గంలో పర్యటించిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రాజగోపాల్‌రెడ్డికి నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధిలేదని, ఆయన ఆర్భాటం, అసంతృప్తి అంతా మంత్రి పదవి కోసమేనని విమర్శించారు. మంత్రి పదవి లేనంత మాత్రాన నియోజకవర్గ అభివృద్ధి చేయలేరా..? అని ప్రశ్నించారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు వేర్వేరు మండలాల్లో కూసుకుంట్లపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేయడమే కాకుండా, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడం ద్వారా నియోజకవర్గంలో రాజకీయవేడి రగలింది. గత ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నం చేసిన చల్లమల కృష్ణారెడ్డి మర్రిగూడలో విలేకరుల సమావేశంలో రాజగోపాల్‌రెడ్డిపై విమర్శలు చేయడం, వెంటనే కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆయనపై ప్రతి విమర్శలు చేయడంతో సోషల్‌మీడియాలో దుమారం చెలరేగింది. చల్లమల కృష్ణారెడ్డికి కాంగ్రెస్‌తో సంబంధం లేదని, అతను కాంగ్రెస్‌లో చేరానని చెప్పుకోవడాన్ని ఖండిస్తున్నామని యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలో కొనసాగుతూ, రాజగోపాల్‌రెడ్డిని ఓడగొట్టేందుకు, కాంగ్రెస్‌ని నష్టపరిచేందుకు తీవ్రంగా ప్రయత్నించారని ఆరోపించారు. మొత్తంగా మునుగోడు ఎమ్మెల్యే వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి


చందంపేట మండలం పోలేపల్లి వద్ద లారీని ఢీకొన్న డీసీఎం

డిండి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన డిండి మండలం చెర్కుపల్లి స్టేజీ సమీపంలోని పెద్దతండా వద్ద ఆదివారం జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చెర్కుపల్లి గ్రామానికి చెందిన ముడి శ్రీను, ముడి రాములు బొలనపల్లి గ్రామం నుంచి తమ ద్విచక్ర వాహనంపై చెర్కుపల్లి గ్రామం వైపు వస్తుండగా పెద్దతండా సమీపంలో డిండి నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఒక వైపు నుంచి ఢీకొనడంతో బైక్‌పై వెనక కూర్చున్న ముడి రాములు(58) అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న ముడి శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

చందంపేట: డిండి నుంచి ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో దేవరకొండ వైపు వెళ్తున్న ధాన్యం లోడు లారీని పోలేపల్లి నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గుర్రంపోడు మండలంలోని చిన్నాయిచింత గ్రామానికి చెందిన డీసీఎం హెల్పర్ బూతం లింగయ్య(45) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో కార్మికుడు రాఘవేందర్, డీసీఎం డ్రైవర్ సైదులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్సకోసం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లింగయ్యకు లింగయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చందంపేట ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి

చివ్వెంల: ద్విచక్రవాహనం అదుపుతప్పి డీవైడర్‌ను ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని గుంజలూరు స్టేజీ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన నత్త భానుప్రకాశ్ తన స్నేహితులతో కలిసి విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తెల్లవారుజామున గుంజలూరు స్టేజీ సమీపంలోకి రాగానే అదుపుతప్పి డీవైడర్‌ను ఢీ కొట్టాడు. ఘటనలో భానుప్రకాశ్‌కు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ భానుప్రకాశ్ మృతిచెందాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. భానుప్రకాష్ తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతి

బీబీనగర్ : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్- ఘట్కేసర్ రైల్వే మార్గంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. సుమారు 25సంవత్సరాల వయసు గల యువకుడు 222/22 మైలు రాయి వద్ద దిగువ లైన్‌పై కదులుతున్న రైలులోంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహంపై బ్లాక్ అండ్ వైట్ కలర్ ఫుల్ టీషర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బోనాల వేడుకలో అపశ్రుతి

గుండాల: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ముత్యాలమ్మకు ట్రాక్టర్లు తిప్పుతున్న సమయంలో గ్రామానికి చెందిన రామగిరి శ్రీరాములు(52) ట్రాక్టర్ ఢీకొని మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బండకొత్తపల్లి గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల సందర్భంగా అమ్మవారికి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు తిప్పుతున్న సమయంలో సంగు శ్రీనివాస్ మద్యం మత్తులో ట్రాక్టర్‌ను నడుపుతూ అదుపు తప్పడంతో బోనాలను చూడడానికి వచ్చిన ప్రజలపై అదుపు తప్పి ట్రాక్టర్ దూసుకెళ్లింది. దీంతో రామగిరి శ్రీరాములు తలకు తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన పోతుగంటి లింగన్నకు గాయాలయ్యాయి. అతనిని జనగాం ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తేజం రెడ్డి తెలిపారు.



ది ఫైనల్ కాల్‌తో మురిపిస్తాం

● తొలిసారి దర్శకత్వం వహిస్తున్న మోత్కూరు వాసి ప్రణయ్‌రాజ్



హైద్రాబాదు సారథి స్టూడియోలో హీరో సుమన్ నుంచి సినిమా క్లాప్ బోర్డు అందుకుంటున్న దర్శకుడు ప్రణయ్‌రాజ్

మోత్కూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలకేంద్రానికి చెందిన ప్రణయ్‌రాజ్ తొలిసారి సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 110కి పైగా సినిమాలు నిర్మించిన తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మాణ సారథ్యంలో ప్రపంచంలో ప్రప్రథమంగా ఒకే రోజు 15సినిమాల నిర్మాణం ప్రారంభించారు. అందులో భాగంగా ప్రణయ్‌రాజ్ దర్శకత్వం వహిస్తున్న 'ది ఫైనల్ కాల్' సినిమాను హైదరాబాద్ సారథి స్టూడియోలో హీరో సుమన్, కమెడియన్ అప్పారావు, షేకింగ్ శేషు తదితరులపై తొలి షాట్ చిత్రీకరించి సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణయ్‌రాజ్ విలేకరులతో మాట్లాడుతూ వెండితెరపై దర్శకుడిగా తన పేరు చూసుకోవాలన్న తన కల నేటితో నెరవేరిందన్నారు. ఆ లక్ష్యంతోనే తాను మోత్కూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లానన్నారు. మోత్కూరుకు చెందిన సినిమా ఎడిటర్ పోచం సోమేశ్వర్ సహకారంతో తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మించిన 'అవంతిక' సినిమాకు సహాయ దర్శకుడిగా పనిచేసిన అనుభవముందని తెలిపారు. ప్రస్తుతం భీమవరం టాకీస్ బ్యానర్‌తో నిర్మిస్తున్న 'ది ఫైనల్ కాల్' సినిమాకు దర్శకత్వం వహిస్తున్నానని తెలిపారు. సస్పెన్స్, థిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో ప్రముఖ నటులతో పాటు నూతన నటులు కూడా నటిస్తున్నారని తెలిపారు.

కలుపు కట్టడి చేద్దాం..

- కలుపు మందుల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అధిక మోతాదులో వాడితే పంటలకు ముప్పు
- వానాకాలం సీజన్‌లో ఊపందుకున్న పంటల సాగు
- కలుపు నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు



వానాకాలం సీజన్‌లో పంటల సాగు ఊపందుకుంది. నల్లగొండ జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో పంటల విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. 12లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో 5.52 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేశారు. అదే విధంగా 5.30లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు.

– నిడమనూరు, ఆంధ్రజ్యోతి

సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో పాటు నాగార్జునసాగర్ జలాశయం కూడా నిండడంతో ఆయకట్టులో సాగు సందడి కన్పిస్తోంది. బోర్లు, బావుల కింద నాట్లు ముగియగా ఆయకట్టులో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. పంటల సాగులో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్య కలుపు మొక్కల నివారణ.ఎంత తొలగించినప్పటికీ ప్రతి 15నుంచి 20 రోజుల్లో పంట కంటే ఎక్కువగా కలుపు పెరుగుతుంది. నేలసారాన్ని పంట కంటేఎక్కువగా ఈకలుపు మొక్కలే పీల్చేస్తాయి. అందుకే కలుపును సమూలం గా నివారించేందుకు దశాబ్దాల క్రితమే రసాయన మందులు వచ్చాయి. అయితే వీటిని ఎంత మేరకు వినియోగించాలి, ఎలా వాడాలి అనే విషయాలపై రైతులు అవగాహన కలిగి ఉంటే మేలు. కలుపు మందులను ఎంత మో తాదులో వాడాలో, ఏ కాలంలో పిచికారీ చేయాలో తె లియక రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయాధికారు ల సలహాలు, సూచనల పాటిస్తూ రైతులు కలుపు నివారణ మందులను వినియోగించాలి. వీటిని నిర్ణీత పరిమాణం మేరకే వాడాలి. మోతాదు మించితే పంట మొక్కలకు, విత్తనాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. నేల సైతం తన సహజత్వాన్ని కోల్పోతుంది. వ్యవసాయాధికారుల సిఫారసు మేరకు కలుపు మందులు వాడాలి. జాగ్రత్తలు తీసుకొని మందులు పిచికారీ చేయాలి.

- పురుగు మందులు, కలుపు మందులు వేర్వేరుగా నిల్వ చేసుకోవాలి. కలుపు మందులు వాడేటప్పుడు అంటే పిచికారీ చేసేటప్పుడు ఇతర రైతుల పంట మొక్కలపై పడకుండా చూసుకోవాలి.
- ఈ మందు మనుషులు, పశువులు, పక్షులు తినే తినే ఆహార పదార్థాలపై పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని పిచికారీ చేయాలి.
- వరిలో కలుపు మొక్కల నివారణకు వరి నాటిన 2 నుంచి 5 రోజుల వ్యవధిలో బ్యూటోక్లోర్ అనే మందు ఒక ఎకరానికి లీటరు గాని లీటరున్నర లేదా అనిలోఫాస్ మందు 500మ నుంచి 600 మిల్లీలీటర్లు లేదా ప్రిటిలాక్లోర్ మందు 500 మిల్లీ లీటర్లు ఇసుకలో కలిపి చల్లుకోవాలి.
- వరి నాటిన 20 నుంచి 25 రోజుల తర్వాత పొలంలో ఇంకా వెడల్పాకు గడ్డి, మొండి జాతి గడ్డి వంటి కలుపు మొక్కలు గుర్తిస్తే 2,4డీ సోడియం సాల్ట్ పొడి మందును ఎకరానికి 600 నుంచి 800గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారీ చేయాలి. లేదా ఒక ఎకరానికి బిస్‌పైరిబాక్ సోడియం అనే మందును 100 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి.
- అయితే మోతాదుకు మించి వినియోగిస్తే పంటకు నష్టం వాటిల్లుతుంది. ఈ మందు పత్తి, మినుము, పెసర పంటలపై వాడొద్దు.
- కొన్ని రకాల కలుపు మందులు కలుపు మొక్కలతోపాటు పంటను కూడా ఒకేసారి నిర్మూలిస్తాం.
- మొండిజాతి కలుపు మొక్కలు గర్క, తుంగ, దర్బ మొక్కలపై గ్లైపోసిట్ మందు పిచికారీ చేయాలి. కలుపు మొక్కలు నాలుగు ఆకుల నుంచి ఆరు ఆకుల దశలో మందు కొట్టాలి. నీటిలో కరిగే పొడి కలుపు మందులను ఇసుకలో గాని యూరియాలో గాని కలిపి చల్లొద్దు.
- హ్యాండ్ స్ప్రేయర్లతోనే పిచికారీ చేయాలి. పవర్ స్ప్రేలు వాడొద్దు.
- కలుపు నివారణ మందును పంట కాలంలో ఒకసారే పిచికారీ చేయాలి. పొలంలో వెనుకకు నడుస్తూ ముందుకు స్ప్రే చేయాలి.

వ్యవసాయాధికారుల సూచనల మేరకే వినియోగించాలి



వరిలో కలుపు మొక్కల నివారణకు రైతులు వ్యవసాయాధికారులు సూచించిన సిఫారసు మేరకే కలుపు మందులు వినియోగించాలి: ఎక్కువ మోతాదులో వాడితే పంటలకు కూడా నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. మందులను ఎక్కువగా వాడి పంటను నాశనం చేసుకోవద్దు. కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

– దండెం విజయచంద్ర,
ఏఈవో, నిడమనూరు క్లస్టర్.

22గేట్ల నుంచి సాగర్ నీటి విడుదల



నాగార్జునసాగర్ నుంచి 22 గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

నాగార్జునసాగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 22 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. సాగర్‌కు ఎగువనుంచి 1,45,076 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం 586.70 అడుగులకు చేరింది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 586.70 అడుగులుగా(303.9495టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,006 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 3,667 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,867 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 1,70,588 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,11,828 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 1,45,076 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

సాగర్‌ను సందర్శించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి రవి

నాగార్జునసాగర్‌ను తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యముఖ్య కార్యదర్శి గుగులోతు రవి కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ముందుగా సాగర్ ప్రధాన డ్యాం, ఎత్తిపోతల, అనుపు, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను సందర్శించారు. అనంతరం హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించి అక్కడ బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధవనంలో స్తూపవనం, జాతక వనం, చరిత వనం, ధ్యాన వనాన్ని తిలకించారు. మహాస్తూపంలో బుద్ధుని ధాతువుల వద్ద బుద్ధజ్యోతి వెలిగించారు.

జాతీయ రహదారులపై వాహనాల రద్దీ

చౌటుప్పల్ టౌన్, చిట్యాలరూరల్, కేతేపల్లి, బీబీనగర్ ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): హైదారబాద్, విజయవవాడ 65వ నంబరు జాతీయ రహదారిపై, యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్ -వరంగల్ 163 జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ పెరిగింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో పాటు పెళ్లిళ్ల , ఇతర శుభకార్యాలు ఎక్కువగా ఉండడంతో ప్రయాణికుల రాకపోకలు ఒక్కసారిగా పెరిగాయి. ఆర్టీసీ బస్ లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. వాహనాల కోసం ప్రయాణికులు జాతీయ రహదారులపై నిరీక్షించాల్సి వచ్చింది. రద్దీని నియంత్రించేందుకు విజయవాడ మార్గంలో జంక్షన్‌ను మూసి వేశారు. ఆదివారం చౌటుప్పల్ లో వారాంతపు సంత జరగడంతో వినియోగదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను సీఐలు మన్మథకుమార్, విజయ్‌మోహన్‌లు నియంత్రించారు.

ఐదు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

● చిట్యాల మండలం పెద్దకాపర్తి స్టేజీ వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నందున వాహనాలను సర్వీస్ రోడ్డు నుంచి మళ్లించారు. రహదారి సరిగా లేక వాహనాలు నెమ్మదిగా క దులుతున్నందున సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చిట్యాల - పవెద్దకాపర్తికి మార్గంలో ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జాం ఏర్పడింది, నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రించారు. చిట్యాల పోలీసులను పెద్దకాపర్తి వద్ద నియమించారు. చిట్యాలలో కూడా జాతీయ రహదారిపై వంతెనను నిర్మిస్తున్నందున వాహనాలను సర్వీసు రోడ్డు మళ్లించడంతో ఐదు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్‌జాం అయింది. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది అష్టకష్టాలు పడ్డారు.



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

● కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ వద్ద గల టోల్‌ప్లాజాలోని టోల్ కౌంటర్ల వద్ద బారులు తీరాయి. టోల్‌ప్లాజాలోని కౌంటర్ల వద్ద సెన్సార్‌లు వేగంగా పని చేయకపోవడం, కొన్ని టోల్ కౌంటర్లు మూసి ఉండడంతో జాప్యం నెలకొంది. టోల్‌ప్లాజాలో ఒక్కో వైపునకు ఆరు కౌంటర్ల చొప్పున ఇరువైపులాలా 12టోల్ వసూలు కౌంటర్లు ఉండగా ఒక్కో వైపు ఒక్కో కౌంటర్‌ను మరమ్మత్తుల పేరిట నిర్వాహకులు మూసి వేశారు. . దీంతో ఒక్కో వైపు 6కౌంటర్లకు బదులు 5కౌంటర్లు మాత్రమే పని చేశాయి. ఒక్కో వాహనం టోల్‌కౌంటర్‌ను దాటడానికి దాదాపు ఐదు నిమిషాల సమయం తీసుకుంది. దీంతో వాహనాలు టోల్‌కౌంటర్ల వద్ద బారులు తీరాయి. వాహనాలను క్రమబద్ధీకరించేందుకు కేతేపల్లి ఎస్ఐ సతీష్ తన సిబ్బందితో శ్రమించాల్సి వచ్చింది.

● బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం భువనగిరి వైపు వెళ్లే మార్గాలు , సాయంత్రం తిరుగు ప్రయాణాల్లో హైదరాబాద్‌కు వెళ్లే మార్గాల వద్ద వాహనాలు రెండు వైపులా కిలోమీటరు మేరతీరాయి.

బీఆర్ ఓయూలో అడ్మిషన్లకు 30వరకు గడువు



నల్లగొండ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ ఓయూ)లో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 30వ తేదీ వరకు చివరి గడువు ఉందని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి. ధర్మానాయక్ అన్నారు. నల్లగొండ యూనివర్సిటీ రీజినల్ సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, 10 ప్లస్2 కోర్సు చదివిన వారు పాలిటెక్నిక్ కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవచ్చన్నారు. బీఏ, బీకాం. బీఎస్సీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. డిగ్రీ, పీజీ రెండో, మూడో సంవత్సర విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియలో ప్రతి సంవత్సరం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్‌కుమార్, ఎన్‌జి కాలేజీ అకడమీ కోఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవి, రాజారామ్, తదితరులు ఉన్నారు.

తెలంగాణ ప్రో కబడ్డీ జట్టుకు అనిల్‌యాదవ్



నేరేడుచర్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రో కబడ్డీ జట్టులో కల్లూరు గ్రామానికి అనిల్‌యాదవ్ చోటు సాధించాడు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరుకు చెందిన సంకబుడ్డి గోపి, పద్మ దంపతుల కుమారుడైన అనిల్‌యాదవ్ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి వరకు పెంచికల్‌దిన్న జడ్పీ హెచ్ఎస్‌లో చదివాడు. ఇంటర్, డిగ్రీ మిర్యాల గూడలో విద్యనభ్యసించాడు. మొదట చిన్నచిన్న టోర్నమెంట్లలో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. అనిల్ ప్రతిభను గుర్తించి తెలంగాణ బోర్డు రాష్ట్రం తరుపున ఆడించటంతో యువ తెలంగాణ ప్రో కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడు. యువ తెలంగాణ ఛాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 5 వరకు హైదరాబాద్‌లో జరిగే కబడ్డీ పోటీల్లో బాసర విద్యుత్ శాఖ జట్టు తరుపున ఆడనున్నాడు. ప్రస్తుతం సరూర్‌నగర్‌లోని జ్యోతి కబడ్డీ అకాడమిలో శిక్షణ పొందుతున్నాడు.

పారా వాలీబాల్ జాతీయ జట్టుకు నరేష్



మేళ్లచెర్వు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో అక్టోబరు 8వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించే పారా క్రీడల్లో సిట్టింగ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌కు సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం కందిబండ గ్రామానికి రాగుల నరేష్‌యాదవ్ ఎన్నికయ్యాడు. గతం లో చైనాలో 2014లో జరిగిన పారా ప్రపంచ బీచ్ వాలీబాల్ పోటీలోంల పాలొన్న నరేష్, భారతదేశాన్ని రెండోస్థానంలో నిలబెట్టారు. ఈసారి క్రీడల్లో దేశానికి బంగారు పతకం తేవడమే లక్ష్యమని, ఈ పోటీకి తనను ఎంపిక చేసిన సెలక్టర్లు, కోచ్‌లకు నరేష్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వర్ధాపురం విద్యార్థిని



మఠంపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర స్థాయి అండర్-15 వాలీబాల్ పోటీలకు సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, వర్ధాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని సౌదసోతు హర్షిత ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు వీరస్వామి ఆదివారం తెలిపారు. చైనాలో జరిగే అండర్-15 వరల్డ్ స్కూల్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా తెలంగాణ టీం తరుపున జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో హర్షిత ప్రతిభ చూపి ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు హర్షిత ఎంపిక కావడంపై ఆమెను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు అభినందించారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

నల్లగొండ స్పోర్ట్స్ , ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్ ఉంటుందని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధి పీవీఎస్ ప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు, విద్యుత్ పోల్ సెంటర్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు క్రీడల వైపు ఆసక్తి చూపనందున ఆత్మవిశ్వాసం కొరవడుతోందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 80మంది మహిళ, పురుష క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన వారిని ఈ నెల 23, 24 తేదీల్లో కొమరంభీం అసిఫాబాద్‌లో జరిగే 71వ రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయన్న, అలీం అసద్, ఉమామహేశ్వర్, శంకర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

పురుషుల విభాగంలో జంగయ్య, గణేష్, నాగరాజు, చంద్రశేఖర్, మనోజ్, దేవేందర్, రాజేష్, లక్ష్మీనరసింహ, జశ్వంత్, సిద్దు, మహిళల విభాగంలో భవ్యశ్రీ, ఏకాంబరేశ్వేరి ఆలీనా, శ్రుతి, వరలక్ష్మి, లావణ్య, శ్రావణి, సాహితీ, అక్షర, ధనలక్ష్మి ఎంపికయ్యారు.

కోలాహలంగా లక్ష్మీనృసింహుని క్షేత్రం





యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో భక్తుల సందడి, పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

● నిత్యాదాయం రూ. 58,05,696

యాదగిరిగుట్ట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో కోలాహలంగా మారింది. రాష్ట్ర నలు మూలల నుంచి స్వామిని దర్శించుకోవడానికి 55వేల మంది భక్తులు తరలివచ్చారు. కొండపైన పార్కింగ్ ప్రదేశం నిండిపోవడంతో దర్శనాలు ముగించుకున్న భక్తులు తమ వాహనాలతో దిగిపోవాలని మైకుల ద్వారా అధికారులు కోరారు. భక్తులతో ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు బారులు తీరాయి. ఉదయం 9 నుంచి 10 గంటలు, సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం (అరగింపు) వరకు మూడు గంటల పాటు భక్తులు ఉభయ క్యూలైన్‌లో వేచి ఉన్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు దక్షిణ రాజగోపురం వద్ద ఉచిత ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 58,05,696ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. స్వామివారిని రవాణ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ దర్శించుకున్నారు. విదేశీయులు సంప్రదాయ దుస్తులు ధరించి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, కొండపైన ప్రతివారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా రోణంకి వాసుదేవరావు బృందం (హైదరాబాద్) భక్తి సంగీతం, కళావతి కళాక్షేత్రం (హైదరాబాద్) కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రేపు హుండీ కానుకల లెక్కింపు

స్వామివారి హుండీ కానుకలను ఈ నెల 19న లెక్కించనున్నట్లు దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కొండకింద వ్రత మండపం-2లో ఉదయం 6.30 గంటలకు లెక్కింపు నిర్వహిస్తామన్నారు. కొండకిందకు హుండీలను తరలించేందుకు 4వ తరగతి సిబ్బంది, హోంగార్డులు, నాయీ బ్రాహ్మణ సిబ్బంది ఉదయం ఆరు గంటలకే చేరుకోవాలన్నారు.

● మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో ఆదివారం స్వామివారి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈవో నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు మందుల పంపిణీ

నల్లగొండరూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా ఎంవీఎన్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా మందులను అందిస్తున్నట్లు ఎంవీఎన్ ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి పుచ్చకాయల నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన ఉచిత మందుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలతో పాటు, రూ.100లతో నెలకు సరిపడా బీపీ, షుగర్, పక్షవాతం మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లారీ డ్రైవర్ల వేతనం పెంపు

చిట్యాల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని రైస్‌మిల్లుల్లో పనిచేసే లారీ డ్రైవర్ల వేతనం పెరిగింది. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన వేతన ఒప్పందం కుదిరింది. గతంలో ఉన్న నెల వేతనంపై రూ.2250లు పెంచడానికి మిల్లు యజమానులు అంగీకరించినట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు హనుమంతు, పెద్దయ్య, శ్రీనివాసులు, లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో ఎన్నికలు



- బీవెల్లెంల పాఠశాలలో నిర్వహణ
- పూర్తిగా ఎన్నికల సంఘం తరహాలోనే ప్రక్రియ
- 19న ఓటింగ్‌కు ఏర్పాట్లు
- బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేసిన ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల (పీఎంశ్రీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'స్కూల్ అసెంబ్లీ' ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 19వ తేదీన బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లను ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగి ఉన్న మన దేశంలో ఓటు, ఎన్నికలు, పరిపాలన, శాసన వ్యవస్థలు వాటి విధులు-బాధ్యతలపై క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అవగాహన పెంపొందించే ఉద్దేశంతోనే 'స్కూల్ అసెంబ్లీ' కి పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకారం చుడుతున్నారు. గతంలో పాఠశాలల్లో విద్యార్థుల కమిటీలు ఉండేవి. కానీ ప్రజల కోసం... ప్రజల చేత.... ప్రజలే ప్రజాస్వామ్య బద్ధంగా నాయకుడిని ఎన్నుకునే విధానాన్ని (విద్యార్థులతో) ఇక్కడ నిర్వహించడం ద్వారా ఎన్నికల వ్యవస్థ పనితీరుపై వారిలో ఓ అవగాహన రానుందనేది ఉపాధ్యాయుల అభిప్రాయం. తరగతికొక రిప్రజెంటేటివ్ (సీఆర్)ను ఎన్నుకుని తర్వాత స్కూల్ మొత్తానికి మరో రిప్రజెంటేటివ్ (ఎస్ఆర్) ను ఓటు హక్కు ద్వారా విద్యార్థులు ఎన్నుకోనున్నారు.

ఎన్నికల సంఘం తరహాలోనే..

రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఏ విధంగా అయితే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తుందో అదే పద్ధతిని ఇక్కడ పాటించనున్నారు. తొలుత రిటర్నింగ్ అధికారి 'స్కూల్ అసెంబ్లీ' ఎన్నికలకు నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేయనున్నారు. ఆ తర్వాత స్టేజ్-1 అధికారితో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ వంటి ప్రక్రియలను పూర్తిచేసి పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. పోటీలో ఉండే అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. ఉదయం ఈ ప్రక్రియనంతా ముగించిన అనంతరం ఓ గంట పాటు ప్రచారానికి సమయం కేటాయించి మధ్యాహ్నం (భోజనం) తర్వాత ఎన్నికలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కోసం బ్యాలెట్ పేపర్లు, బాక్సులను సిద్ధం చేస్తున్నారు. స్టేజ్-2 అధికారి పర్యవేక్షణలో పోలింగ్ జరగనుంది. పాఠశాలలోని విద్యార్థులందరికీ ఓటు హక్కును కల్పించనున్నారు.

అదే రోజు ఓటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించే కార్యాచరణను రూపొందించారు. అయితే ఎస్ఆర్ (స్కూల్ రిప్రజంటేటివ్)గా పోటీ చేసే విద్యార్థుల అర్హతను 8 నుంచి 10వ తరగతి వరకే పరిమితం చేయాలా? లేక 6, 7వ తరగతి విద్యార్థులను కూడా అర్హులుగా పరిగణించాలా అనే విషయంపై నిర్ణయం తీసుకోలేదు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే



విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ స్కూల్ అసెంబ్లీ ఏర్పాటు లక్ష్యం. ఒక బాధ్యత నిర్వహిస్తే విధులు.. బాధ్యతలు తెలియడంతో పాటు పెద్దయ్యాక ఆ నాయకత్వ లక్షణాలతో సవాళ్లను అధిగమించి సమాజంలో ముందడుగు వేయడానికి దోహదపడుతుంది. దీంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలంటే ఏమిటి, వాటిని ఎలా నిర్వహిస్తారో ఎన్నికల తర్వాత పరిపాలన ఎలా చేయాలో అనే అంశంలో కూడా విద్యార్థులకు కొంత విషయ పరిజ్ఞానం కలగనుంది. కేవలం చదవడంలోనే కాదు నాయకత్వ లక్షణాల్లోనూ పోటీతత్వంతో జీవితాన్ని ఎలా గట్టెక్కాలో విద్యార్థి దశనుంచే వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపే ఓ చిన్ని ప్రయత్నమే మా ఈ స్కూల్ అసెంబ్లీ.

- కూకుట్ల నర్సింహ, హెచ్ఎం

అన్నీ సిద్ధం చేస్తున్నాం



తరగతి గదుల్లో పుస్తకాలలోని పాఠ్యాంశాలు బోధించడమే కాకుండా పాఠ్యాంశాల్లోని కీలక అంశాలపై క్షేత్ర స్థాయిలో కార్యాచరణ ద్వారా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన బృహత్తర కార్యక్రమం ఇది. ఇప్పటికే చాలా పాఠశాలలో మాక్ అసెంబ్లీని నిర్వహిస్తున్నారు. మేం అదేబాటలో ఎన్నికల నిర్వహణ ద్వారా పాల(నాయ)కుడిని ఎన్నుకునే ప్రజాస్వామ్య వ్యవస్థ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ స్కూల్ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహిస్తున్నాం. రిటర్నింగ్ ఆ తదుపరి ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు సిబ్బంది వరకు ఎలా విధులు నిర్వహిస్తారో నామినేషన్ల నుంచి విజేత ప్రకటించే వరకు ప్రతీ ప్రక్రియపై విద్యార్థుల్లో అవగాహన వచ్చేలా స్కూల్ అసెంబ్లీ ఎన్నికలకు అంతా సిద్ధం చేస్తున్నాం. బ్యాలెట్ పేపర్‌లో నోటాను కూడా చేర్చాం.

-నరేష్, ఉపాధ్యాయుడు, స్కూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి



బీజేపీ జిల్లా అధ్యక్షుడితో మోహన్‌రెడ్డి

నల్లగొండటౌన్ ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ఫకీరు మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కలిసి తన నియామకానికి సహకరించినందకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి గారు మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టడమే కాకుండా ప్రజలను చైతన్యవంతం చేస్తామని తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రజలను జాగృతం చేసి వాటి అమలుకు ఆందోళన కార్యక్రమాలను చేపడతామని అన్నారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు.

జిల్లా కార్యదర్శిగా పబ్బు వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లుగౌడ్

కట్టంగూరు: మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన పబ్బు వెంకటేశ్వర్లుగౌడ్‌ను బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలో బీజేపీ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా మైల నర్సింహ



మైల నర్సింహ

చిట్యాలరూరల్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన మైల నర్సింహ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను విధానాలను, సిద్ధాంతాలకు అనుగుణంగా క్రమశిక్షణతో శక్తివంచన లేకుండా సమర్థవంతంగా నిర్వహిస్తానని, ప్రజాసమస్యలపై పోరాటం చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రాబోయే స్థానిక సం స్థల ఎన్నికల్లో పార్టీ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేస్తానన్నారు.

మహేష్ కుటుంబానికి ఆర్థిక సాయం



శాలిగౌరారం : మహేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న చీఫ్ సెక్రటరీ గోపాల్ సోదరులు

శాలిగౌరారం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు బండారు మహేష్ అకాల మృతికి పలువురు స్పందించి ఆర్థిక సాయం చేశారు. శాలిగౌరారం గ్రామానికి చెందిన తమిళనాడు ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రెటరీ డాక్టర్ కూతాటి గోపాల్ రూ. 20 వేలు పంపించారు. ఆ డబ్బులను శాలిగౌరారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతాటి సోమయ్య, చంద్రయ్య ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే శాలిగౌరారం గ్రామానికి చెందిన నిమ్మల రామ్మూర్తి, నిమ్మల నాగరాజు, నిమ్మల శ్రీనివాస్, నిమ్మల నరేష్, నిమ్మల సురేష్‌లు కలిసి రూ.10వేలు, భైరవునిబండ గ్రామానికి చెందిన ఈదులకంటి శంకర్ రూ.10 వేలు, లండన్‌లో విద్యను అభ్యసిస్తున్న శాలిగౌరారం గ్రామానికి చెందిన లోడే శివ, బుడిగె కార్తీక్, గంట శివప్రసాద్ రూ.15వేలు, పెంబళ్ల భిక్షం, జమ్ము రమేష్, నిమ్మల రాములు, సుల్తాన్ లక్ష్మమ్మ ఒక్కొక్కరు 50కిలోల చొప్పున బియ్యం కుటుంబ సభ్యులకు అందజేశారు.

● చిట్యాల : చిట్యాల పట్టణంలోని 7వ వార్డుకు చెందిన గాదె మరియమ్మ-సైదులు కుమార్తె శ్రీలక్ష్మి వివాహం, ఉప్పలపెల్లి శారద-యాదయ్య కుమార్తె నాగమణి వివాహం ఆదివారం జరిగింది. చిట్యాల మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ కూరెళ్ల లింగస్వామి వారికి రూ.10వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ గత మునిసిపల్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సాయం చేసినట్లు తెలిపారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



విజయ్‌కుమార్

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ముచ్చర్ల విజయ్ కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సమాచార పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటో పోటీలకు నల్లగొండ నుంచి విజయ్ పంపించిన ఫొటోలకు ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లోని గ్రీన్‌పార్కు హోటల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్పెషల్ కమిషనర్ ప్రియాంక అందజేయనున్నారు. వీరికి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు రావడంపై పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాటు ఎం.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, కె.వెంకన్నలకు కూడా రాష్ట్రస్థాయి ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డులు లభించాయి.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

నల్లగొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకుడు సాధిక్ ఆలీ కోరారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం మైనార్టీలకు కల్పిస్తున్న హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం త్వరలో కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు సయ్యద్ శౌకత్ అలీ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు మైనార్టీలకు నేటి వరకు అందడం లేదని, ఇప్పటికే చాలా మంది మైనార్టీలో పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కోసం మైనార్టీలంతా సమైక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది ఎండీ నజీర్, మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె.చాంద్‌పాషా, జిల్లా అధ్యక్షుడు ఎంఏ గఫూర్, ప్రధాన కార్యదర్శి ముబీన్, ఎండీ.షాహేన్ తయ్యబ్, అబీబ్ అహ్మద్, బషరత్ ఆలీ, డాక్టర్ హాస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో బోనాల పండుగ



నార్కట్‌పల్లి : అవురవాణిలో ముత్యాలమ్మ బోనాలతో వెళ్తున్న గ్రామస్థులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బోనాల పండుగ ఆనందోత్సాహాల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. యాదవులు తమ కులదైవమైన పెద్దమ్మ తల్లికి వేపాకు, పసుపు, కుంకుమతో అలంకరించిన బోనంపై దీపం వెలిగించి నైవేద్యాన్ని పెట్టి ఊరేగింపుగా వెళ్లారు. యాదవుల సంప్రదాయ డప్పు నృత్యాలు, వేషధారణలతో పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లి భక్తితో బోనాలు సమర్పించారు. ఈ వేడుకలో మేడబోయిన శ్రీనివాస్, నడింపల్లి నరేశ్, నాగరాజు, మహేశ్, చుక్కయ్య, బొబ్బలి దేవేందర్, పాల్గొన్నారు. అలాగే మండలంలోని అవురవాణిలో ముత్యాలమ్మ తల్లికి బోనం సమ ర్పించారు. కార్యక్రమంలో శ్రీరామోజు వెంకటేశ్వర్లు, కల్లూరి కంఠమహేశ్వర్, ఎడ్ల యాదగిరిరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మునుగోడు రూరల్ : మండల కేంద్రం, మండలంలోని కోతులారంతో పాటు పలు గ్రామాల్లో గ్రామదేవతలకు ఊర బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా విభాగం కార్యదర్శి, మాజీ సర్పంచ్ మల్లేశ్వరీ, లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్ : మండలంలోని నేరడ, వెలిమినేడు గ్రామాల్లో బోనాల ఉత్సవాలను జరుపుకున్నారు. యువకులు కేరింతలు కొడుతూ బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు.

● మర్రిగూడ : మండలంలో పలు గ్రామాల్లో బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న జయంతిని జయప్రదం చేయాలి

● గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి కాశయ్య గౌడ్



నల్లగొండలో మాట్లాడుతున్న గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కాశయ్యగౌడ్

నల్లగొండ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతిని ఘనంగా నిర్వహించాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి కాశయ్య గౌడ్ పిలుపు నిచ్చారు. స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వాయి పాపన్న ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యధర్శి ఎరుకల శంకర్, బండారు గోవర్ధన్, చెరుకు మల్లికార్జున్, నర్సింహా చారి, వినాయక చారి, రఘువీరాచారి, యాదగిరి, శంకర్‌గౌడ్, రేగులగడ్డ సత్యనారయణ పాల్గొన్నారు.

● కట్టంగూరు: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని గౌడ యువజన సంఘం మండలాధ్యక్షుడు ఎరుకల లక్ష్మీనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన గౌడ యువజన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కట్టంగూరు పట్టణ గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా కట్టంగూరుకు చెందిన కానుగు శ్రీనుగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కానుగు శ్రీనును పలువురు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు అయితగోని సైదులు, అయితగోని సత్యనారాయణ, అయితగోని శివ, ఎరుకల మల్లేష్, ఎరుకల విజయ్, పోగుల యాదగిరి, పొడిచేటి కిరణ్, ఎల్మకంటి ప్రభాకర్, నరేష్, రాజు, మహేష్, వెంకన్న, శివ, రాము, సందీప్, నవీన్, కృష్ణ, తిరుమల్లేష్ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి



ఈదులూరులో కంటి వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్లు

కట్టంగూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాలిగౌరారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కొండల్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ అఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి సహకారంతో ఈదులూరు గ్రామంలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐ కొండల్ రెడ్డి సూర్యాపేట కంటి ఆస్పత్రి చైర్మన్, మాజీ ఎమ్మె ల్యే దోసపాటి గోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ కొండల్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజకలకు సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ ముందుండటం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ మాట్లాడుతూ తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎంతో మంది పేద వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నామని చెప్పారు. శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 25 మందికి ఆపరేషన్ చేయడానికి గుర్తించి సూర్యాపేట ఆసుపత్రి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీఎంటీ కోఆర్డినేటర్ గుడిపూడి వెంకటేశ్వరరావు, పటేల్ నరసింహారెడ్డి, జోన్ చైర్మన్ బుడిగ శ్రీనివాసులు, డీసీ మెంబర్ డెంకల సత్యనారాయణ, ఎర్ర శంబులింగారెడ్డి, క్లబ్ అధ్యక్షులు చిక్కు శేఖర్, కార్యదర్శి శివప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కేతేపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ కోరారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తూ సెలవులు, ఖాళీ సమయాల్లో జాతరలు, ఉత్సవాలు, వార సంతలు, రద్దీ ప్రదేశాల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించడాన్ని సామాజిక సేవా కార్యక్రమంగా కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం మూసీ ప్రాజెక్టు వరద నీటితో పొంగి పొర్లుతుండడంతో ఆదివారం అక్కడకు వచ్చిన ప్రభాకర్ అక్కడి సందర్శకులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

మీసేవ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుకు కృషి



నూతనంగా ఎన్నికైన మీ సేవ నూతన కార్యవర్గ సభ్యులు

నల్లగొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీ సేవ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామని మీ సేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహిద్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మీ సేవ ఆపరేటర్ల ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరై మాట్లాడారు. పదేళ్లుగా మీ సేవ నిర్వాహకుల సమస్యలపై పోరాటం చేస్తూ వాటిని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కమీషన్ పెంచనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎండీ అబ్దుల్ రహీం, జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల క్రాంతికుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాసం కీర్తన, ఉపాధ్యక్షులు రమావత్ రాజా, దొమ్మటి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు అక్కినపల్లి హోంప్రసాద్, కుసుమ జగదీష్, ట్రెజరీగా కొత్త సంతోష్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల బాలరాజు, లీగల్ అడ్వైజర్ ఉదయ్‌కుమార్, రాజ్‌ఖాఖా పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 472 మందికి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గట్టుప్పల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యశిబిరంలో 472 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 87 మంది కంటి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని వెంటనే హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో నాయకులు నామ జగన్నాథం, రావుల రమేష్. టేకుమట్ల శ్రీరాములు, రావుల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ రూరల్: ఉచిత వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ అధ్యక్షుడు తంతనపల్లి సైదులు అన్నారు. లయన్స్ క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో ఐకాన్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం నల్లగొండ మండలంలోని పెద్దసూరారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా వైద్య పరీక్షలు, ఉచిత టెస్టులు చేసి బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు తమ వంతుగా సేవలు, సహాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్, వైద్య సిబ్బంది, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు యాస వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

● సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు యాదయ్య

మర్రిగూడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యం లో నిర్వహించిన జీపీ కార్మికుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పారిశుధ్య కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, వారికి నెలసరి చెల్లించిన వేతనాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. ఈ వర్కర్లకు కనీస వేత నం రూ.26 వేలు, పీఎఫ్ ఈసీఐ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ ఈనెల 20న కనగల్ మండలంలో మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ మహాసభకు మండలం నుండి పదిమం ది డెలిగేషన్ ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో లింగయ్య, యాదయ్య, ముత్తమ్మ, అమృత పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	1,45,076	2,11,868
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.70 (3.86)	2937.90	5248.56
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.011 (38.3600)	2,08,530	2,04,130

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

చల్లంగా చూడమ్మ

చల్లంగా చూడమ్మ ఎల్లమ్మ, మా ఇంటిల్లిపాదిపై నీ కరుణా కటాక్షలు ఉండాలమ్మా ముత్యాలమ్మ, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలమ్మా మైసమ్మ. అంటూ జిల్లావ్యాప్తంగా గ్రామదేవతలకు మొక్కుకున్నారు. బోనాల వేడుకల్లో భాగంగా అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించారు.

● వివరాలు 6,8లో..



చిట్యాల మండలం నేరడలో బోనాలు తీస్తున్న గ్రామస్థులు



కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

రయ్.. రయ్‌మంటూ

రయ్.. రయ్‌మంటూ జాతీయ రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు ముగియడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు మహానగరానికి బయలుదేరారు. దీంతో జిల్లాలోని 65వ నెంబర్ జాతీయ రహదారి సందడిగా మారాయి.

● వివరాలు 7లో..

రాజగోపాల్‌ను చల్లబరుస్తారట!

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కేంద్రంగా రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. తరచూ ఆయన ప్రభుత్వంపైన, కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎంరేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేస్తుండడంతో పీసీసీ రంగంలోకి దిగాల్సిన అనివార్యస్థితి ఏర్పడింది.రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను పరిశీలించాల్సిందిగా పీసీసీ క్రమశిక్షణా సంఘాన్ని ఆదేశించినట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌రెడ్డి తెలపగా, రాజగోపాల్‌రెడ్డికి, కాంగ్రెస్‌నేతలకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న విబేధాలు తొలగించేందుకు పీసీసీ క్రమశిక్షణాసంఘం చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి రంగంలోకి దిగారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



» వివాదం సద్దుమణిచే యోచనలో అధిష్ఠానం
» రంగంలోకి క్రమశిక్షణా కమిటీ

హైదరాబాద్‌లో ఆదివారం సమావేశమైన క్రమశిక్షణాసంఘం రాజగోపాల్‌రెడ్డి ఏ సందర్భంలో వ్యాఖ్యలు చేశారనే అంశాలను పరిశీలించినట్లు సమాచారం. సమావేశం అనంతరం మల్లు రవి మాట్లాడుతూ తాను ఫైరింజన్ లాంటివాడినని, మంటలు ఆర్పడమే తన పని అని పేర్కొనడం ద్వారా రాజగోపాల్‌రెడ్డి అంశాన్ని సద్దుమణిగించేందుకు చర్యలు ప్రారంభించినట్లు స్పష్టమవుతోంది. మరోవైపు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సైతం ఏపీలోని విశాఖపట్నంలో మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి అసమ్మతి లేదని, ఎవరి మధ్య విభేదాల్లేవని పేర్కొన్నారు. రాజగోపాల్‌రెడ్డి సైతం పార్టీ ఉన్నతి కోసమే మాట్లాడుతున్నారని భట్టి వ్యాఖ్యానించడం ద్వారా రాజగోపాల్‌రెడ్డి అంశాన్ని అధిష్ఠానం మధ్యేమార్గంగా పరిష్కరించే యోచనలో ఉన్నట్లు సంకేతాలిచ్చినట్లేనని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

తీవ్రత పెంచుతూ వచ్చిన రాజగోపాల్‌రెడ్డి

బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సమయం లో,తిరిగి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రెండుసార్లు తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ మంత్రి పదవి ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది.తనకు పదవి రాకపోవడానికి గల కా రణాలుగా పేర్కొంటూ ఒక్కోసందర్భంలో ఒక్కొక్కటిగా బహిరంగపరుస్తుండడంతో కలవరం రేగుతోంది. మంత్రి వర్గవిస్తరణకు ముందే ఏప్రిల్‌లో చౌటుప్పల్‌లో జరిగిన మార్కెట్ కమిటీ పా లకవర్గ ప్రమాణస్వీకార సందర్భంలో మొదటిసారి రాజగోపాల్‌రెడ్డి తన అసంతృప్తగళాన్ని వి ప్పారు. తనకు మంత్రిపదవి ఇవ్వడానికి అధిష్ఠానవర్గం దాదాపు సిద్ధమైన తరుణంలో మా జీమంత్రి జానారెడ్డి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని లేఖరాయడం ద్వారా తన అవకాశాలకు గండిపడిందని భావించిన రాజగోపాల్‌రెడ్డి చౌటుప్పల్ సభలో జానారెడ్డిని ధృతరాష్ట్రుడితో పోల్చుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్నప్పటికీ ఇటీవల మళ్లీ ఎక్స్‌లో ట్వీట్లతో, నియోజకవర్గంలో కార్యక్రమాల్లో తీవ్ర వ్యాఖ్యలతో సంచలనం సృష్టిస్తున్నారు. సోషల్ మీడియాపై సీఎం వ్యాఖ్యలను ఖండించారు. తనకంటే జూనియర్లకు పదవులిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎల్‌బీనగర్‌లో పోటీచేస్తే మంత్రిపదవి ఇచ్చేవారని, కానీ తానే మునుగోడు అభివృద్ధి కోసం ఇక్కడ పోటీచేశానని చెప్పారు. మహబూబ్‌నగర్‌కు సీఎం పదవి, ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు ఇవ్వగా లేనిది నల్లగొండ జిల్లాకు మూడు పదవులిస్తే తప్పేంటని ప్రశ్నించడం ద్వారా నిత్యం రాజకీయవర్గాల్లో చర్చను రేకెత్తించారు.

సమీకరణలు కుదరక..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఒక మీడియా ప్రకటనలో మంత్రి పదవి విషయంలో రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మాట ఇచ్చింది వాస్తవమేనన్నారు. సమీకరణలు కుదరక ఇవ్వలేకపోయారని పేర్కొనడంతో రాజగోపాల్ వాదనకి బలం చేకూరింది. అనంతరం ఏ సమీకరణలు కుదరడం లేదని, తామిద్దరం అన్నదమ్ములమన్న విషయం మాట ఇచ్చినప్పు డు తెలియదా? అని రాజగోపాల్‌రెడ్డి అధిష్ఠానాన్ని నిలదీశారు. తాజాగా శనివారం మరోసారి రాజగోపాల్‌రెడ్డి సంస్థాన్‌నారాయణపురం మండలంలో జరిగిన కార్యక్రమంలో పదవులే కాదు.. పైసలు కూడా ఇవ్వ డం లేదని వాపోయారు. తమ నియోజకవర్గంలో...

- మిగతా 6వ పేజీలో...

బీసీలను మోసం చేస్తున్న పార్టీలు

బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పాలూరి రామకృష్ణయ్య

నల్లగొండటౌన్ ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బీసీలను పాలక పార్టీలు మోసం చేస్తున్నాయని బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సమాజంపై పాలకపార్టీలు అవలంబిస్తున్న మోసపూరిత విధానాలను ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు రిజర్వేషన్లు అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. 42శాతం రిజర్వేషన్ అమలు శాసనసభ పరిధిలోనిదేనని ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్‌తో ఆమోదింపజేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. చట్టసభలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయవచ్చని దానిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని కప్పి పెడుతూ కేంద్రం ఒప్పుకోవడం లేదని ఆరోపిస్తూ రిజర్వేషన్ ఇవ్వకుండా తప్పించుకుంటుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ బీసీలపై చిన్నచూపు చూస్తోందని, రిజర్వేషన్లకు సహకరించకుండా కుల గణన చేయకుండా బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. రెండు పార్టీల విధానాలను ఎండగడుతూ బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి రూపకల్పన చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఐతగోని రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శి వాసు కె. యాదవ్, అధికార ప్రతినిధి చీమల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సిల్వేరు గాలయ్య, డాక్టర్ విద్యారాణి చారి, నాయకులు యాదన్న, మధుమూర్తి గౌడ్, లక్ష్మి, సంహిత, చెరుకు లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరుతరాల ఆత్మీయ సమ్మేళనం

ఆహ్లాదం గడిపిన కుటుంబ సభ్యులు




ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉప్పుల వంశీయులు

నిడమనూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి చిన్న పిల్లల వరకు ఆరు తరాలకు చెందిన వారు ఒకేచోట కలుసుకున్నారు. ఒకరికొకరు పరిచయం చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనందంగా గడిపారు. పెద్దలను గౌరవించి ఘనంగా సన్మానించారు. ఈ ఆత్మీయ కలయిక నిడమనూరు మండలం గుంటిపల్లికి చెందిన ఉప్పుల వంశీయులు ఆదివారం మండలంలోని కోట మైసమ్మ ఆలయం వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సమ్మేళనంలో 100 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సమ్మేళనం పండుగ వాతావరణంలో జరిగింది. 4వ తరానికి చెందిన ఉప్పుల గోపయ్య దంపతులను 6వ తరానికి చెందిన వారు సత్కరించారు. కుటుంబ విలువలు పడిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి సమ్మేళనాలు బంధుత్వాలు పెంపొందించేందుకు దోహదం చేస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పుల రాధాకిషన్, కేశవులు, శ్రీనివాస్, సత్యనారాయణ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఖుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, నాయకులు తూం బుచ్చిరెడ్డి, దేప సుదర్శన్‌రెడ్డి,కోరే యాదయ్య, వలమాల ఆంజనేయులు, ఎండీ. షైనుద్దీన్, వెంకటేశ్వర్లు, జూలూరి వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గట్టుప్పల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మతోన్మాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు కార్యకర్తలు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ మనువాదాన్ని తీసుకురావాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. భారతదేశ ప్రజలు భిన్నత్వంలో ఏకత్వాన్ని కోరుకుంటారని, లౌకికవాదానికి కేంద్రంగా ఇండియా ఉందని, బీజేపీ మతోన్మాద చర్యలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేకమంది సీపీఎం కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని సమ సమాజ స్థాపన కోసం పార్టీ పనిచేస్తుందని అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అంతంపేట, నామాపురం, శివన్నగూడెం రోడ్లు అధ్వానంగా తయారయ్యాయన్నారు. గత ఎన్నికల ముందు లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకుడు చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చాపల మారయ్య, మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, నాయకులు కర్నాటి సుధాకర్, అచ్చిన శ్రీనివాస్, కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ,రాములమ్మ, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచే వరకూ పోరాటం



దేవరకొండలో సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

దేవరకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులు, వృద్ధుల పింఛన్లు పెంచేంత వరకు ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదివారం జరిగిన నియోజకవర్గ దివ్యాంగులు, వృద్ధుల సన్నాహాక సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ 18 సంవత్సరాలుగా ప్రభుత్వాలపై పోరాటం చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పింఛన్ల పెంపుపై మాట్లాడటం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ పింఛన్ల పెంపు విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచి ఆయన వారి హృదయాల్లో నిలిచిపోయాడన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఎన్నికల హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేల చొప్పున పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సెప్టెంబరు 9వ తేదీన జరగనున్న దివ్యాంగుల చేయూత పింఛన్‌దారుల మహాగర్జన సభకు లక్షలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి గడ్డం కాశీం, సభ అధ్యక్షుడు గుద్దేటి సైదులు మాట్లాడుతూ కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కూడా పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారుల సంఘం నాయకులు శ్రీరామదాసు వెంకటచారి, వెంకన్న యాదవ్, చైతన్యరెడ్డి, ఎరుకల రామేశ్వరి, అందుగుల శ్రీను, ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కంబాలపల్లి వెంకటయ్య, జల్లా నర్సింహ, దీప్లా, కృష్ణ, భాగ్యమ్మ, సుజాత, అలివేలు, నర్సింహ, పార్వతి

'రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం'

వేములపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి శశిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు తమ పనులన్నీ మానుకొని యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియాను అందించి ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో నాయకులు రొండి శ్రీనివాస్, కోడిరెక్క వెంకన్న, ప్రణీత్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి



డిండి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డిండి మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన వానం నరేందర్‌రెడ్డి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకుగా పనిచేశారు. ప్రస్తుతం బీజేపీ మండల అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

వాగు వెంట రక్షణ గోడ నిర్మించాలి



ఎస్సీ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

పెద్దవూర, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ పక్కన ఉన్న చిన్న వాగు వెంట రక్షణ గోడ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం సీపీఎం సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడు తూ ఎస్సీ కాలనీలో 80 పేద కుటుంబాలు నివాసం ఉంటున్నారని, పెద్ద ఊర చెరువు అలుగు పోసినప్పుడు కాలనీ ఇళ్లల్లోకి నీళ్లు చేరి అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. కాలనీలో మురుగుకాల్వలు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించాలని, లోఓల్టేజీ విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, నాయకులు ఎస్‌కె.బషీర్, దోరేపల్లి మల్లయ్య పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు, ఉట్ల పండగ



దేవరకొండ పాతరామాలయం ఎదుట ఉట్టి వేడుకలో పాల్గొన్న యువకులు

దేవరకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మల్లిఖార్జునస్వామి దేవాలయం, పెద్ద రామాలయం ఎదుట యాదవసంఘం ఆధ్వర్యంలో ఉట్ల పండుగను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు దేవాలయం వద్దకు చేరుకొని ఉట్లు కొట్టే వేడుకలను తిలకించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవకమిటీ, యాదవసంఘం, మల్లిఖార్జునస్వామి దేవాలయం, సీతారామచంద్రస్వామి దేవాలయం ఆలయకమిటీ నిర్వాహకులు నక్క వెంకటేష్ యాదవ్, రఘురాములు, నేతాళ్ల వెంకటేష్, జాన్‌యాదవ్, విజయ్‌కుమార్, కనబోని మల్లయ్య, వెంకటయ్య యాదవ్‌తో పాటు మహిళలు, యాదవసంఘం నేతలు పాల్గొన్నారు. కాగా 2వ వార్డులో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైసమ్మ దేవాలయం ఎదుట బోనాలతో మొక్కులు తీర్చుకొని పూజలు చేశారు.

చింతపల్లి: చింతపల్లి మండలకేంద్రంలోని గట్టుపత్తి వేంకటేశ్వరస్వామి గుట్ట సమీపంలో యాదవులు ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు ఆదిత్యుని సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధుల గుండా ఊరేగింపుతో గుట్టపైకి తరలించారు. అనంతరం యాదవులు భక్తిశ్రద్ధలతో ఉట్లు కొట్టి భక్తి భావాన్ని చాటుకున్నారు.

విద్యార్థులుగా వెళ్లి.. సీనియర్ సిటిజన్‌గా కలిశారు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో 1971-76 సమయంలో అభ్యసించిన విద్యార్థులు కలుసుకున్నారు. ఐదు దశాబ్దాల అనంతరం మిత్రులందరం కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించి, ఉన్నత శిఖరాలకు చేర్చిన గురువులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి విద్యార్థులందరినీ సీనియర్ సిటిజన్లుగా కలుపుకోవడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. కార్యక్రమంలో క్యామ వెంకటేశం, చిట్యాల వెంకటరమణారావు, ఆకారపు లింగయ్య, గాలి నారాయణరెడ్డి, అల్లాని ఉదయభాను, తిప్పన జనార్ధనరెడ్డి, జయ, కిరణ్మయి, ఝాన్సీ, చంద్రయ్య, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంకాపురం బ్రిడ్జి నిర్మాణమెప్పుడో?



బంకాపురం కల్వర్టు మీదుగా ప్రవహిస్తున్న నీరు

- పూర్తిగా ధ్వంసమై ప్రమాదస్థితికి చేరుకున్న కల్వర్టు
- వర్షం వస్తే పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నవైనం
- ప్రతిపాదనలకే పరిమితమైన వంతెన నిర్మాణం

నిడమనూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడమనూరు-బంకాపురం గ్రామాల నడుమ చిలుకల వాగుపై పూర్వకాలంలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా ధ్వంసమై ప్రమాదస్థితికి చేరింది. కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలిపోయింది. కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో గతంలో కురిసిన వర్షాలకు అనేక సార్లు తెగిపోయింది. కల్వర్టు తెగిపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. మండలంలోని బంకాపురం, వెనిగండ్ల, సూరేపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ కల్వర్టు మీదుగా మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వర్షాలు కురవడంతో పాటు నిడమనూరు చెరువు నిండి అలుగు పోస్తే కల్వర్టు మీదుగా ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తుంటుంది. దీంతో వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. 14వ మైలురాయి చెక్‌పోస్టు మీదుగా ఆయా గ్రామాలకు ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. కల్వర్టు పూర్తిగా శిథిలమవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కల్వర్టు తెగిపోయి ప్రమాదాలు జరుగుతున్నా కల్వర్టు స్థానంలో బ్రిడ్జి నిర్మించకపోవడంతో పాటు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకుండా గూనలు వేసి మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. మట్టి పోయడం వలన కోతకు గురవుతుంది. గతంలో కల్వర్టు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.5లక్షల నిధులు మంజూరు చేసినా సరైన మరమ్మతులు చేయకుండా పైపైన మట్టి పోసి బిల్లులు ఎత్తుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పూర్తిగా శిథిలమై ప్రమాదస్థితిలో ఉన్న బంకాపురం కల్వర్టు మీదుగా ప్రమాదమని తెలిసినా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఉంది. గతంలో నిడమనూరు ఆదర్శ పాఠశాలలో వాచ్‌ఉమెన్‌గా పనిచేస్తున్న పెందోటి లక్ష్మి అనే మహిళ వాగు దాటుతూ ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి గూనల్లో ఇరుక్కుని మృతి చెందింది. భార్య మరణాన్ని తట్టుకోలేక ఆమె భర్త నర్సింహ ఆత్మహత్య చేసుకున్నాడు. బంకాపురం గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్ కూడా కల్వర్టులో పడిపోయింది. గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరైనా టెండర్లు ఖరారు కాకపోవడంతో బ్రిడ్జి నిర్మాణం అటకెక్కింది. ప్రస్తుతం రూ.3కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికైనా నిడమనూరు-బంకాపురం గ్రామాల నడుమ చిలుకల వాగుపై ఉన్న కల్వర్టు స్థానంలో సత్వరమే వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



బంకాపురం కల్వర్టు పూర్తిగా దెబ్బతిని ప్రమాదాలకు నిలయంగా మారింది. కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ మార్గంలో వివిధ గ్రామాల ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. వర్షాల కారణంగా వరదనీరు కల్వర్టు మీదుగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కల్వర్టు వద్ద వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

\- పోలే రవి, వెనిగండ్ల

రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

బంకాపురం కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రూ.3 కోట్ల నిధుల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే టెండర్ ఖరారు చేసి కల్వర్టు వద్ద వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- సాయిప్రసాద్, పీఆర్ ఏఈ

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి
- వేంపాడ్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం
- మండలంలో విస్తృత పర్యటన



వేంపాడ్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించడమే ధ్యేయమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేంపాడ్‌లో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో 34 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా, ఇందులో 32 స్టేషన్లు జానారెడ్డి హయాంలో నిర్మించినవేనన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక సబ్ స్టేషన్ మాత్రమే నిర్మించారని తెలిపారు. ఓవర్ లోడ్, లో వోల్టేజీ సమస్యలు నివారించేందుకు అవసరమైన చోట సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాత మేరెడ్డి స్ఫూర్తిరెడ్డిని అభినందించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న బంకాపురం కల్వర్టును, నిడమనూరు చెరువును, నూతన పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలు గణపురం వెంకన్న, మెరుగు అంజయ్యను పరామర్శించారు.

స్కూటీ నడిపిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

మండలంలో సుడిగాలి పర్యటనలో భాగంగా నిడమనూరులో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి స్కూటీ నడిపి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించి లోపల గోడలకు వేసిన గులాబీ రంగులను మార్చాలని సూచించారు. ఇటీవల వర్షాలకు నిండి అలుగు పోస్తున్న నల్లచౌట చెరువును పరిశీలించారు. చెరువు కట్టపై స్కూటీపై తిరుగుతూ చెరువు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఈ శ్రీనివాసాచారి, ఏడీఈలు తిరుపతయ్య, నాగేశ్వరరావు, దీప్తి, ఎంపీడీవో వెంకటేశం, ఏఈ శరత్‌కుమార్, ఎస్ఎల్ఐ మారం శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, నాయకులు మేరెడ్డి పుష్పలత, నందికొండ మట్టారెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, మేరెడ్డి కృష్ణవివేక్‌రెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, విజయ్, వంశీ, స్ఫూర్తిరెడ్డి, శ్రీను, దాసు, సతీష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలు దైవ చింతన కలిగి ఉండాలి

నాగార్జునసాగర్: ప్రజలు దైవచింతన కలిగి ఉండాలని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సాగర్ పైలాన్ కాలనీలో మూడు రోజులుగా శ్రీ సత్యసాయిబాబా భజన మందిరంలో నిర్వహిస్తున్న నవ చండీయాగ సహిత మహా రుద్రయాగంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి సత్యసాయిబాబా జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సాగర్ సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు పగడాల నాగరాజు, జంగయ్య, రామకృష్ణ, మరియు భక్తులు పాల్గొన్నారు.



విరాట్‌నగర్‌లో ముఖద్వారానికి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని అంగడి కుర్మపల్లి గ్రామంలో జగజ్జనని కాళికా మహాదేవి ఆలయ ముఖద్వార నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంగడి కుర్మపల్లి గ్రామంలో కాళికాదేవీ 135వ వార్షికోత్సవాల భాగంగా విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాల కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కుర్మపల్లిలో కాళికాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, దేవస్థాన చైర్మన్ డాక్టర్ ముంజంపల్లి చారి, అధ్యక్షుడు అందోజు వీరచారి, పెందోట వెంకటేశ్వర్లు, దార్ల జంగయ్యచారి, పిన్నెల మల్లయ్య, ఆదిమూలం మహేష్, అందోజ్ సత్యం, మాజీ జడ్పీటీసీ జె.హరినాయక్, అంగిరేకుల గోవర్ధన్, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేష్‌యాదవ్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.



కుర్మపల్లిలో బోనాలతో వెళ్తున్న విశ్వబ్రాహ్మణులు

కన్నులపండువగా స్వర్ణరథ ప్రారంభోత్సవ పూజలు



పూజల్లో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం స్వర్ణరథ ప్రారంభోత్సవ పూజలు, హోమాలు కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. వాసవీ మాతకు బంగారు పూతతో చేయబడిన స్వర్ణరథం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకే పుణ్యాహవచనం, రక్షబంధనం, యాగశాల ప్రవేశం, గోమాత పూజ, మహాగణపతి హోమం, బాలత్రిపుర సుందరిహోమం, దేవత ప్రధాన కలశ అవగాహన హోమాలు వైభవంగా నిర్వహించారు. 50 హోమం గుండాల్లో 250మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హోమంలో పాల్గొని అమ్మవారికి స్వర్ణరథ ప్రారంభోత్సవ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, స్వర్ణరథ నిర్మాణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పానగంటి మల్లయ్య, వనపర్తి మురళి, కోశాధికారి వాస వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి రాచమళ్ల వెంకటేశ్వర్లు దంపతులతో పాటు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీదెళ్ల వెంకటేశ్వర్లు, స్థానికులు దొడ్డి వెంకటేశ్వర్లు, కర్నాటి జనార్ధన్, నీల సంజీవకుమార్, కర్నాటి పురుషోత్తం, వాసవీ మహిళ సభ్యులు పందిరి జ్యోతి, శ్రీదేవి, స్వప్న, గీత, శిరీష, కుంకకూరి రవళి, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములను కబ్జా నుంచి కాపాడాలి



సమస్యను మందకృష్ణకు వివరిస్తున్న దళిత రైతులు

దేవరకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణ శివారు 346 ఇనాం మాన్యం భూములను తమకే దక్కేలా చూడాలని దళిత రైతులు కోరారు. ఆదివారం దేవరకొండకు వచ్చిన మందకృష్ణ మాదిగను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ఆ భూమిలో సేద్యం చేసుకుంటూ ఉంటున్నా మని, ఇటీవల భూముల ధరలు పెరగడంతో కొంత మంది భూమి తమదేనని దౌర్జన్యం చేస్తూ ఆక్రమించుకుంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి కబ్జాలో ఉన్న దళితులకే భూములు దక్కేలా చూస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంకూరి సుగుణయ్య, పొట్ట చంద్రమౌళి, మాతంగి శ్రీను, ప్రసాద్, విజయ్, అంకూరి శివ, శేఖర్, వంశీ తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో చలకుర్తి చిన్నారుల ప్రతిభ



పతకాలతో విహాస్, సుదీక్ష

పెద్దవూర, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఇండో నేపాల్ అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన చిన్నారులు ప్రతిభ చాటారు. పాతనబోయిన విహాస్ కటాస్ విభాగంలో మొదటి స్థానం సాధించి బంగారు పతకం, పాతనబోయిన సుదీక్ష రెండోస్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించారు. ఈ టోర్నమెంట్‌లో ఇండియా, నేపాల్ దేశాలకు చెందిన పలువురు కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడలపై ఆసక్తితో టోర్నమెంట్ ఏదైనా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న ప్రతీ టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సాధిస్తూ అక్కాతమ్ముళ్లు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా విహాస్, సుదీక్షలను గ్రామస్థులు అభినందించారు.

ఆరుబయటే జంతువధ

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- నిరుపయోగంగా స్లాటర్ హౌస్



నిర్మాణ దశలోనే పనులు నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఇదే..

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో లక్షన్నరకు పైగా జనాభా ఉంటారు. అందులో మాంసప్రియులు దాదాపుగా సగ భాగం ఉంటారు. వారందరికీ మాంసాన్ని విక్రయించేందుకు వ్యాపారులు ప్రతీ ఆదివారం ఆరుబయటే జంతువధ చేస్తున్నారు. అందుకు కారణం స్లాటర్ హౌస్ వినియోగంలోకి తేకపోవడమే.

నిరుపయోగంగా స్లాటర్ హౌస్

పట్టణంలోని షాబూనగర్‌లో దశాబ్దకాలం కిందట నిర్మించిన స్లాటర్ హౌస్ నిరుపయోగంగా మారింది. పట్టణానికి దూరంగా, సరైన రహదారి, వసతులు లేని కారణంగా జంతు వధశాల ప్రారంభానికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న స్లాటర్‌హౌస్‌లో కొంతకాలం అసాంఘిక కార్యక్రమాలు కొనసాగాయి. సదరు హౌస్ కిటికీలు, తలుపులు చోరీకి గురయ్యాయి.



నిరుపయోగంగా స్లాటర్ హౌస్

కరోనా కాలం నుంచే..

గతంలో నేతాజీ కూరగాయల మార్కెట్‌లో మాంస విక్రయాలకు ప్రత్యేక స్టాళ్లు ఉండేవి. అయితే పట్టణం నలువైపులా విస్తరిస్తుండటంతో శివారు ప్రాంతాల్లో మాంస విక్రయ దుకాణాలు వెలిసి, గిరాకీ తగ్గింది. దీంతో నేతాజీ కూరగాయల మార్కెట్‌లో మాంస విక్రయాలకు వ్యాపారులు సుముఖత చూపలేదు. ఇక కరోనా కాలంలో విధించిన లాక్‌డౌన్ కారణంగా దాదాపు అన్ని మార్కెట్లు మూసివేయడం, ఎక్కడబడితే అ క్కడ కూరగాయలతో పాటు చికెన్, మటన్, ఫిష్ విక్రయాలు జరగడంతో నేతాజీ కూరగాయల మార్కెట్‌లోని స్టాళ్లలో మాంస విక్రయాలు పూర్తి గా పడిపోయాయి. అక్కడి వ్యాపారుల్లో కొందరు ఇతర ప్రాంతాలలోకి దుకాణాలను తరలించగా, మరికొందరు వ్యాపారులు మాంసం విక్రయాలను బంద్ చేసుకున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రకటనతో...

పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో, మినీ రవీంద్రభారతి పక్కనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మంజూరైంది. అత్యాధునిక వెజ్, నాన్‌వెజ్, ఫిష్ మార్కెట్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం పనులు ప్రారంభించింది. పిల్లర్లు పోసి, మొదటి అంతస్థు స్లాబ్ వేసే వరకూ పనులు శరవేగంగా సాగాయి. తదనంతరం నిధుల కొరత కారణంగా సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

ఆరుబయటే జంతువధ

స్లాటర్ హౌస్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అందుబాటులోకి రాకపోవడంతో మాంస వ్యాపారులు ఆరుబయటే జంతు వధ చేస్తున్నారు. పట్టణంలోని టాకా రోడ్డు, ఖమ్మంరోడ్డు లోని మేదరి కాలనీ, హౌజింగ్ బోర్డు, విద్యానగర్, అశోక్‌నగర్, నేతాజీ కూరగాయల మార్కెట్, రైతుబజార్, సీతారాంపురం, బంగారుగడ్డ తదితర ప్రాంతాల్లో ఏటా మాంస విక్రయాలు జోరుగా సాగుతాయి. అయితే ఆయా ప్రాంతాలలోని వ్యాపారుల్లో కొందరు ప్రైవేటుగా జంతువధ చేసి విక్రయాలు చేసుకుంటుండగా, మరికొందరు ఆరుబయటే యథేచ్ఛగా జంతువుల ప్రాణాలు తీసి మాంసాన్ని విక్రయిస్తున్నారు. సాక్షాత్తూ మునిసిపల్ కార్యాలయం ఎదుటే ఆదివారం రోడ్డుపై జంతు వధ చేస్తుండగా రక్తం రోడ్డుపైకి వస్తోందని, జంతు కళేబరాలు, వ్యర్థాల కారణంగా దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు

పట్టణంలో జంతు వధశాలను నిర్మించి, వినియోగంలోకి తేవాలని వినియోగదారులు కోరుతున్నారు. పరిశీలన, పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు చనిపోయిన గొర్లు, మేకపోతుల మాంసాన్ని విక్రయిస్తున్నారని, శుచి, శుభ్రత లేకుండా వ్యాపారం చేస్తున్నారు. స్లాటర్ హౌస్ త్వరితగతిన నిర్మించి నాణ్యతతో కూడిన మాంసం విక్రయాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇక ప్రధాన కూడళ్లు, రహదారులపై జంతువధ జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరుబయట జంతువధ చేస్తే చర్యలు



ఆరుబయట జంతు వధ చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. మాంసం విక్రయదారులు నాణ్యత, ప్రమాణాలు పాటించకుంటే ప్రజారోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదముంది. పట్టణంలో అత్యాధునికతతో కూడిన వెజ్, నాన్‌వెజ్, చేపల మార్కెట్‌ను రూ.4.5 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పనులు పునఃప్రారంభిస్తాం.

\- శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ